AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
22-4-2026 (Wednesday) MAIN EDITION

## మమతా బెనర్జీకి షాక్.. ఆ కేసులో మళ్లీ విచారణ షురూ..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఈడీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్య వివాదంపై సుప్రీంకోర్టు మరోసారి విచారణను ప్రారంభించింది. కోల్‌కతాలోని రాజకీయ వ్యూహ సంస్థ ఐ ప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అడ్డంకులు సృష్టించారని ఈడీ పేర్కొంది. ఈ మేరకు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. ముఖ్యంగా సంస్థ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌కు సంబంధించిన అంశాల్లో కూడా జోక్యం జరిగిందని ఈడీ ఆరోపించింది. దీనిపై జస్టిస్ పీకే శర్మ, ఎన్‌వీ అంజారియా బెంచ్ విచారణ చేపట్టనుంది.

## రూ.90 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ నగరంలో భూముల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఓ వైపు చెరువులను రక్షిస్తూనే.. మరోవైపు ప్రభుత్వ, ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలను కబ్జా చెరల నుంచి విడిపిస్తోంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో 9.05 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు బుధవారం కాపాడారు. దీని విలువ రూ.90 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## కర్ణాటక హోంమంత్రిపై కేసు నమోదుకు కోర్టు ఆదేశం



**అక్షరటుడే, బెంగళూరు:** కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర, డిప్యూటీ కమిషనర్ శుభా కళ్యాణ్‌లకు కోర్టులో చుక్కెదురైంది. గతేడాది జరిగిన ఒక కబడ్డీ మ్యాచ్‌పై పందెం కాసిన వ్యవహారంలో వారిద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బెంగళూరులోని 42వ అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు పోలీసులను ఆదేశించింది.

## ఐటీలో క్రాష్.. కుదేలైన ప్రధాన కంపెనీల షేర్లు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఏఐ రాకతో సంప్రదాయ సర్వీస్ బిజినెస్ మోడల్‌లో పనిచేస్తున్న ఐటీ కంపెనీలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. తాజాగా వెలువడిన హెచ్‌సీఎల్ టెక్ త్రైమాసిక ఫలితాలు నిరాశపరచడంతోపాటు బలహీనమైన భవిష్యత్ అంచనాల కారణంగా బుధవారం ఐటీ షేర్లు కుప్పకూలాయి.

## హైదరాబాద్ నుంచి 8 కొత్త వీక్లీ స్పెషల్ ట్రైన్లు



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** ప్రయాణికులకు రైల్వే శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం కొత్తగా 8 రైళ్లను వేసింది. ప్రయాణికుల రద్దీ మేరకు వీక్లీ స్పెషల్ ట్రైన్లను నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఢిల్లీ పాఠశాలల్లో వాటర్‌బెల్

**అక్షరటుడే, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అల్లాడుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు ఎక్కువగా నీరు తాగించేలా బడుల్లో ప్రతి గంటకు 'వాటర్ బెల్' మోగించాలని ఆదేశించింది. దేశ రాజధానిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో పిల్లలను సురక్షితంగా ఉంచడానికి పాఠశాలలు ఇప్పుడు తక్షణ చర్యలను అమలు చేస్తున్నాయి. పిల్లలలో డీహైడ్రేషన్, వేడి సంబంధిత అనారోగ్యాలను నివారించే లక్ష్యంతో ముందుజాగ్రత్త చర్యలను అమలు చేయాలని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ మరియు ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలలను అధికారులు ఆదేశించారు.

## పెరగనున్న కండోమ్‌ల ధరలు

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావంతో ఇప్పటికే గ్యాస్, ఇంధన ధరలు పెరిగాయి. తాజాగా ఆ లిస్ట్‌లో కండోమ్‌లు సైతం చేరనున్నాయి. కండోమ్‌లతో పాటు ఆసుపత్రి గ్లౌజుల ధరలు పెరిగే అవకాశం ఉందని కారెక్స్ బెర్హాద్ తెలిపింది. ధరలు 2030 శాతం మేర పెరగవచ్చని, అలాగే ఆరోగ్య సంరక్షణ సామగ్రిపై ఒత్తిడి పెరుగుతోందని హెచ్చరించింది. ప్రపంచంలోనే అతిపెద్ద కండోమ్ తయారీ సంస్థ, మలేషియాకు చెందిన కారెక్స్ బెర్హాద్ ఈ ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ యుద్ధంతో పెట్రోకెమికల్, రబ్బరు సరఫరా గొలుసులకు అంతరాయం కలిగినట్లు పేర్కొంది.





**కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు భారీ ఊరట లభించింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టొద్దని న్యాయస్థానం ఆదేశించింది. కమిషన్ రిపోర్టును నిలిపివేసింది. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.**

**–అక్షరటుడే, హైదరాబాద్**

# కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట

- కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు
- నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టొద్దని ఆదేశం
- సుప్రీంను ఆశ్రయించనున్న రాష్ట్ర ప్రభుత్వం!

బీఆర్ఎస్ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. అయితే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో నిర్మాణంలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరంపై విచారణకు పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిటీ సుదీర్ఘంగా విచారణ చేపట్టి గతేడాది జులైలో నివేదిక అందజేసింది. అప్పటి సీఎం కేసీఆర్, హరీశ్‌రావు సహా పలువురు అధికారుల తప్పిదాలతో ప్రాజెక్ట్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయని కమిషన్ పేర్కొంది.

### కోర్టును ఆశ్రయించిన కేసీఆర్

కాళేశ్వరం కమిషన్ ఏర్పాటును సవాలు చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.కె.జోషిలు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంతోనే విచారణ ముగియగా.. తాజాగా తుది తీర్పు వెల్లడించింది. ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలూ పాటించలేదని కోర్టు పేర్కొంది. నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని ఆదేశించింది. దీంతో కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు స్మితా సబర్వాల్, ఎస్.కె.జోషిలకు కోర్టు ఊరట లభించింది.

### చట్టబద్ధమే

పీసీ ఘోష్ కమిషన్‌ను తెలంగాణ హైకోర్టు నిలిపివేసింది. ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఆ కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదని న్యాయస్థానం పేర్కొంది. సెక్షన్ 8 కింద నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. అయితే కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమేనని తెలిపింది. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో అప్పీల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. గురువారం కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం అంశంపై చర్చించనున్నారు.

### సత్యమేవ జయతే..

కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని మరోసారి నిరూపితమైందన్నారు. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టిందని పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయని పేర్కొన్నారు. కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి రైతుల ప్రయోజనాలు కాపాడాలని కోరారు.



## రామ్ చరణ్‌తో స్టెప్పులేయనున్న శృతిహాసన్

**టాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న పెద్ది సినిమా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్పెషల్ సాంగ్‌పై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ స్పెషల్ సాంగ్ కోసం మొదటగా మృణాల్ ఠాకూర్, మానస వారణాసి, సంయుక్త మీనన్ వంటి పలువురు హీరోయిన్ల పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. అయితే చివరకు మేకర్స్ శృతి హాసన్ ని ఎంపిక చేసినట్లు ఫిల్మ్ నగర్‌లో బలంగా వినిపిస్తోంది. ఇదే నిజమైతే, రామ్ చరణ్ – శృతి హాసన్ కాంబో మరోసారి వెండితెరపై సందడి చేయబోతోంది.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**

## హైదరాబాద్‌లో మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంపు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ రంగంలోకి దిగింది. మెట్రో స్టేషన్లలో రద్దీని తట్టుకునేందుకు, ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందించేందుకు రైళ్ల ఫ్రీక్వెన్సీని గరిష్ఠ స్థాయికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సమ్మె కాలం ముగిసే వరకు రోజంతా మొత్తం 56 మెట్రో రైళ్లను నిరంతరాయంగా నడపాలని అధికారులు నిర్ణయించారు. మియాపూర్ - ఎల్బీ నగర్ కారిడార్ మార్గంలో ప్రతి 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు అందుబాటులో ఉంటుంది. రద్దీ ఎక్కువగా ఉండే నాగోల్ - రాయదుర్గ్ రూట్‌లో, ప్రతి 3 నిమిషాల 40 సెకన్లకో రైలు నడపనున్నారు.

## సమ్మె విరమించండి..: మంత్రి పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఆర్టీసీ కార్మికుల సమ్మెతో బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సమ్మెను విరమించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఆర్టీసీ సమ్మె విరమించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. సమ్మె సమస్యకు పరిష్కారం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని చెప్పారు. నాలుగు వారాల్లో ఈ కమిటీ నివేదిక ఇస్తుందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం సరికాదన్నారు. కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వ్యతిరేకత లేదని పేర్కొన్నారు. అన్ని వెంటనే పరిష్కారమయ్యే అంశాలని తెలిపారు.

## మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత



**అక్షరటుడే, ఏపీ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు (90) కన్నుమూశారు. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయన నేడు తుది శ్వాస విడిచారు. నాదెండ్ల భాస్కర్ రావు వయో సంబంధిత సమస్యలతో కాంటినెంటల్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఉంచనున్నారు. పంజాగుట్ట హిందూ శ్మశానవాటికలో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ప్రపోజ్ చేస్తానని ప్రియుడి ప్రాణం తీసిన ప్రియురాలు




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఓ యువతి తన ప్రియుడికి ప్రపోజ్ చేస్తానని చెప్పి ప్రాణాలు తీసింది. కొత్త స్టైల్‌లో లవ్‌ను ఎక్స్‌ప్రెస్ చేస్తానని బాయ్ ఫ్రెండ్ కళ్లకు గంతలు కట్టి.. కిరోసిన్ పోసి నిప్పు అంటించింది. ఈ ఘటన బెంగళూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బైదరహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంజనానగర్‌లోని ఒక ఇంట్లో మంగళవారం ఈ ఘటన జరిగింది. కిరణ్ (27) అనే యువకుడు ప్రేరణ అనే యువతితో రెండేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. ప్రేరణ ఆహ్వానం మేరకు మధ్యాహ్నం సమయంలో అతడు ఆమె ఇంటికి వెళ్లారు. వీరు ఇద్దరు ఒక ప్రైవేట్ టెలికాం సంస్థలో పని చేస్తున్నారు. ఆమె కిరణ్ కళ్లకు గంతలు కట్టి, సర్‌ప్రైజ్ ప్రపోజల్ చేస్తానని చెప్పి కుర్చీకి కట్టేసింది. ఆ తర్వాత అతని దుస్తులు తొలగించి, అతని దృష్టి మరల్చి, ముందుగా సిద్ధం చేసుకున్న పెట్రోల్, కిరోసిన్ పోసి నిప్పంటించింది. దీంతో అతను అక్కడికక్కడే మరణించాడు.

## మళ్లీ పెరగనున్న ఎండల తీవ్రత



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండ తీవ్రత మళ్లీ పెరగనుంది. రెండు రోజులుగా చల్లబడిన వాతావరణం వేడెక్కనుంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మూడు రోజులపాటు అకాల వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. ఈదురుగాలులు, వడగాళ్ల వానలతో వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే గురువారం నుంచి భానుడు మళ్లీ తన ప్రతాపం చూపుతాడని అధికారులు తెలిపారు. మొన్నటి వరకు తెలంగాణ వ్యాప్తంగా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రేపటి నుంచి వడగాలుల తీవ్రత, గతంలో వచ్చిన దానికంటే ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## కాల్పుల విరమణ పొడిగింపు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. యుద్ధాన్ని ముగించేందుకు ఒక ప్రతిపాదనను ముందుకు తీసుకు రావడానికి టెహ్రాన్‌కు మరింత సమయం ఇచ్చేందుకు దాడిని వాయిదా వేశామన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య గతంలో సీజ్‌ఫైర్ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. రెండు వారాల ఒప్పందం నేటితో ముగిసింది. ఈ క్రమంలో తమ ప్రతిపాదనలకు అంగీకరించకపోతే ఇరాన్‌పై పెద్ద ఎత్తున దాడులు చేస్తామని ట్రంప్ మంగళవారం ప్రకటించారు. కాల్పుల విరమణను పొడిగించే ప్రసక్తే లేదన్నారు. అయితే తాజాగా ఆయన మరోసారి వెనక్కి తగ్గారు. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు సీజ్ ఫైర్ పొడిగించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.